

డ్రోన్‌లతో రూపుదిద్దుకున్న దుర్గాదేవి


గిన్నిస్ రికార్డులకెక్కిన డ్రోన్ పులి

ఆకాశంలో అమ్మ దర్శనం

- మైసూరులో అలరిస్తున్న డ్రోన్ షో
- 3వేల డ్రోన్‌లతో అమ్మవారు, పులి, రాష్ట్ర మ్యాప్ తదితర చిత్రాలు
- గిన్నిస్ రికార్డు అందుకున్న మంత్రి

- వివరాలు 7లో

బీజేపీ కుట్రలు భగ్నం

- రాష్ట్రంలో సజావుగా కులగణన: సీఎం



బెంగళూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేను బహిష్కరించాలన్న బీజేపీకి తగిన గుణపాఠం అయ్యిందని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అనే పిలుపును భగ్నం చేయాలని కుట్ర పన్నారన్నారు. బీసీ కమిషన్ ద్వారా రాష్ట్రంలోని 7 కోట్లమంది ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన సమగ్ర వివరాలు సేకరించదలిచామన్నారు. సంపద, అవకాశాలు, ప్రాతినిధ్యం అందరికీ దక్కాల్సి ఉందన్నారు. అందుకే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. బిహార్‌లో బీజేపీ మైత్రిప్రభుత్వం కులగణన జరిపిందని, తెలంగాణలో జరిగిందని అక్కడ బీజేపీ నాయకులు మౌనంగా ఉన్నారన్నారు. కానీ రాష్ట్రంలో మాత్రం అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టులలోనూ వారికి చేదు అనుభవమే మిగిలిందన్నారు. కాగా కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి కులగణనను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. సర్వే చేసేందుకు మా ఇంటికి వస్తే వివరాలు ఇచ్చేది లేదని బహిరంగ ప్రకటన చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రప్రభుత్వం నిర్వహించే కులగణనకు ఎక్కడా గుర్తింపు లేదన్నారు. కేంద్రప్రభుత్వం త్వరలోనే జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టనుందన్నాయి.

మాకే బిల్లు ఇస్తావా..?

- భోజనం హోటల్ నిర్వహిస్తున్న మాజీ సైనికుడిని చితకబాదిన పోలీసులు


గాయాలతో ఆస్పత్రిలో రామప్ప నిప్పాణి

బెంగళూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భోజనం చేశాం..అయితే మాకే బిల్లు ఇస్తావా..అంటూ పోలీసులు ఓ మాజీ సైనికుడిపై విరుచుకుపడ్డారు. ధారవాడలో హోటల్ నిర్వహిస్తున్న మాజీ సైనికుడిని పోలీసులు చితకబాదిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆదివారం రాత్రి 11గంటలకు సప్తపుర లే అవుట్ వివేకానందసర్కిల్‌లో పోలీసులు భోజనం చేసేందుకు వెళ్లారు. ఏఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లు భోజనం ముగించారు. బిల్లు ఇచ్చేందుకు వెళ్లగా పోలీసులు మాకే బిల్లు ఇస్తావా...? ఇంతరాత్రి దాకా ఎందుకు హోటల్ పెట్టావు..? అంటూ గొడవ చేశారు. భోజనం చేసినందుకే బిల్లు అడుగుతున్నా అని మాజీ సైనికుడు రామప్ప నిప్పాణి వాదించగా మరింత ఆగ్రహంతో ఏఎస్సైతోపాటు పోలీసులు ఒక్కసారిగా హెల్మెట్‌తోపాటు లాఠీలతో చితకబాదారు. మెస్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. తీవ్రగాయాలపాలైన రామప్ప నిప్పాణి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ధారవాడ జిల్లా ఉక్కలి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రామప్ప నిప్పాణి హోటల్ నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా భార్యతోకలసి సైనిక్ మెస్ అండ్ హోటల్ పేరిట వ్యాపారమే జీవనంగా కొనసాగిస్తున్నారు. ఇదే విషయమై ఆయన భార్య మీడియాతో మాట్లాడుతూ తన భర్తను తన ఎదురుగానే ఐదుగురు పోలీసులు కలసి తీవ్రంగా కొట్టారన్నారు. తనను నోటికి వచ్చినట్టు దూషించి అవమానం చేశారన్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకున్నారు. ధారవాడ ఉపనగర్‌కు చెందిన పోలీసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రంగస్థల నటుడు యశ్వంత్ దేశ్‌పాండే కన్నుమూత

9


దేశ్‌పాండే (ఫైల్)

బియ్యం పంపిణీకి స్వస్తి..!

- రేషన్ దుకాణాల్లో మార్పులకు సర్కార్ కసరత్తు





- చక్కెర, ఉప్పు, కందిబేడలు, వంట నూనెలతో ప్రత్యేక ప్యాక్
- బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేసేందుకే : డీసీఎం డీకే

బెంగళూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దశాబ్దాలకాలంగా 'అన్నభాగ్య' పేరిట అందిస్తున్న బియ్యం కోటాకు కోత విధించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో బీపీఎల్‌కార్డు కల్గిన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 5 కేజీల బియ్యం చొప్పున నెలకు పంపిణీ చేస్తున్నారు. గతంలో నామమాత్రపు విలువతో బియ్యం పంపిణీ చేసేవారు. 2013లో సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఉచితంగా బియ్యం అందిస్తున్నారు. గతంలో 7 కేజీల బియ్యం ఒక్కో లబ్ధిదారుడికి రాష్ట్రప్రభుత్వ కోటాగా పంపిణీ చేసేవారు. బీజేపీ ప్రభుత్వంలో 2 కేజీలు కుదించారు. అయితే కొవిడ్‌కాలంలో బీపీఎల్ కార్డులు కల్గినవారికి కేంద్రప్రభుత్వం 5 కేజీల బియ్యం అందిస్తోంది. ఇలా రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలతో కలిపితే బీపీఎల్ కార్డులు కల్గినవారికి 10 కేజీల బియ్యం అందేది. బీజేపీ ప్రభుత్వం బియ్యం కోటా తగ్గించడంతో ఒక్కొక్కరికి 7 కేజీలు మాత్రమే అందించేవారు. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర కోటాగా 5కేజీల బియ్యం ఇస్తామని ప్రకటించారు. ఇలా బీపీఎల్‌కార్డు కల్గిన ప్రతి వ్యక్తికి 10 కేజీల బియ్యం సాధ్యం అయ్యేది. అయితే రాష్ట్రప్రభుత్వం 5 కేజీల బియ్యం సమకూర్చేందుకు సాధ్యం కాలేదు. దీంతో దాదాపు ఏడాదిన్నర కాలానికిపైగా 5 కేజీల బియ్యానికి ప్రత్యామ్నాయంగా నగదు బదిలీ చేశారు. ఇటీవల దేశవ్యాప్తంగా బియ్యం నిల్వలు పెరగడంతోపాటు కేంద్రప్రభుత్వ అనుబంధమైన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) బియ్యం సమకూర్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ఇలా బీపీఎల్ లబ్ధిదారుడికి 10 కేజీల బియ్యం అందిస్తున్నారు.

కేంద్రం నుంచి 5 కేజీలు..

కేంద్రప్రభుత్వం అందించే బియ్యం రాష్ట్రప్రభుత్వానికి సంబంధం లేకపోవడంతో 5 కేజీల బియ్యం యథావిధిగా అందుతుంది. రాష్ట్రప్రభుత్వం అందించే 5 కేజీల బియ్యాన్ని పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే తరహా ప్రత్యామ్నాయంగా పలు నిత్యావసర వస్తువులను అందించాలని భావిస్తున్నారు. 5 కేజీల బియ్యానికి బదులుగా పౌష్టికాహారం సమకూరేలా వివిధ నిత్యావసరాలను ఓ ప్రత్యేకమైన కిట్ రూపంలో అందించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉచితంగా 10 కేజీల బియ్యం ఇస్తున్నందున దుర్వినియోగం అవుతోందనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు ప్రధాన కారణం రాష్ట్రవ్యాప్తంగా వరుసగా రెండేళ్లు సంతృప్తికరమైన వర్షాలు కురిశాయి. ఈ ఏడాది అంతకుమించి అనేలా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని జలాశయాలు భర్తీ అయ్యాయి. ఆగస్టుకే ప్రాజెక్టులు భర్తీ కావడంతో కాలువల ద్వారా చెరువులకు నీరు మళ్లించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది రబీలో అత్యధికంగా వరి సాగు చేసేందుకు వీలుంది. సొంతపొలంలో పండిన బియ్యాన్ని విక్రయించేందుకు రైతులు సిద్ధమవుతారు. అంతస్థాయిలో అవసరాలు ఉండవనేది తెలిసిందే. సొంత బియ్యం విక్రయించేందుకు రైతులు సిద్ధమైతే బీపీఎల్ కార్డులు ఉన్నవారు కూడా బియ్యం పొందేందుకు ఆసక్తి చూపరు. కూలిపనులకు వెళ్లేవారు సైతం బియ్యం పొందుతారు. చౌకధాన్య డిపోలద్వారా అందించే బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా బియ్యం కోటాను రద్దు చేసేందుకు సిద్ధమవుతోంది.

నిత్యావసరాలతో ప్రత్యేక కిట్

ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీల్లో అన్నభాగ్య బియ్యం కూడా కీలకమైనది. ఏటా వేల కోట్ల రూపాయలు ఇందుకోసం ఖర్చు చేస్తున్నారు. సద్వినియోగం కాకపోగా బ్లాక్‌మార్కెట్‌కు తరలుతుండడంతో ప్రత్యేక ఆహారకిట్లను పంపిణీ చేయదలిచారు. కిట్లలో ఒక కేజీ చక్కెర, ఒక కేజీ ఉప్పు, కేజీ కందిబేడలు, కేజీ వంటనూనె, 2 కేజీల గోధుమలు, 100 గ్రాముల టీ పొడి, 50 గ్రాముల కాఫీపొడిని ఒక ప్యాకెట్‌గా చేసి అందించాలని భావిస్తున్నారు. అయితే పౌర ఆహార సరఫరాల ఏజెన్సీ నిర్వాహకులు కిట్లద్వారా పంపిణీని వ్యతిరేకిస్తున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కమీషన్ తక్కువైనా కొన్నేళ్లకాలంగా ఇదే జీవనంగా సాగిస్తున్నామని, ప్రస్తుతం కిట్ల రూపంలో అందిస్తే వేలాదిమంది నష్టపోతారని అభిప్రాయపడుతున్నారు. మరి ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే..!

విదేశాలకు తరలుతున్న పేదల బియ్యం : డీకే

రామనగరలో గ్యారెంటీ పథకాల విజయవంతంపై జరిగిన సభలో డీసీఎం డీకే శివకుమార్ పరోక్షంగా బియ్యం కోటాను తగ్గించే అంశాన్ని ప్రస్తావించారు. అన్నభాగ్య పథకం బియ్యం బ్లాక్‌మార్కెట్‌కు పోతోందని ఏకంగా విదేశాలకు ఎగుమతి అవుతోందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధమైన ఆహార పదార్థాలు తీసుకునే విధానం ఉంది. బెంగళూరుతోపాటు మైసూరు జిల్లాలు అన్నం, రాగిముద్ద ప్రధానమైన ఆహారం. ఉత్తరకర్ణాటకలో జొన్నరొట్టె, సజ్జరొట్టె ప్రధానమైన ఆహారం. తీరప్రాంత జిల్లాలలో భిన్నమైన ఆహార విధానం ఉంది. కేరళ తరహాలో ఎర్రబియ్యం ఎక్కువగా వినియోగిస్తారు. ఇలా కొన్నిప్రాంతాల్లో బియ్యం ఉపయోగించనందునే బ్లాక్‌మార్కెట్‌కు తరలుతోందనే విమర్శలు ఉన్నాయి.



చల్లగ చూడమ్మా..చదువుల తల్లీ!


ముళబాగిలు ముత్యాలపేట గంగమ్మదేవికి సరస్వతి అలంకరణ

శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు సోమవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. మూలా నక్షత్రం అమ్మవారికి ఇష్టమైనదిగా భావిస్తారు. దీంతో అమ్మ దర్శనానికి భక్తులు బారులు తీరారు. పలు చోట్ల చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. చల్లగా కరుణించి చదువులు ప్రాప్తించేలా చూడాలని అమ్మవారిని మొక్కుకున్నారు. అనంతరం ఒడిబియ్యం సమర్పించి విశేష పూజలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు


సరస్వతి అలంకరణలో గిరినగర్ వాసవీమాత


ఇంద్రాణి అలంకరణలో విద్యారణ్యపుర కాళికాదుర్గా పరమేశ్వరి

ఇదేమి కర్మ..!

- కర్మకాండలకు కరువైన స్థలం
- నీట మునిగిన శ్మశానాలు
- పూడ్చిన మృతదేహం బయటకు తేలిందని బంధువుల ఆవేదన


బురదమయమైన శ్మశానంలో ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

బళ్లారి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అంతిమయాత్ర కష్టాలు పలు గ్రామాల్లో ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఎవరైనా మృతి చెందితే శ్మశానంలో పూడ్చి కర్మకాండలు చేపట్టడం ఆనవాయితీ. అయితే వర్షాల కారణంగా పలు చోట్ల శ్మశానాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయనగర జిల్లా హూవనహడగలి తాలూక లోని తుంగభద్ర నది తీర గ్రామాల్లో శ్మశానవాటికలు ఇటీవలి వర్షాలకు నీట మునిగిపోయాయి. ఈ ఏడాది ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాటు తుంగభద్ర పొంగిపొర్లుతోంది. దీంతో నది సమీపంలోని మగాల, హొసహళ్లి, హిరేలునినమట్టి, మకరబ్బి, టైలహాన్ని నందిగామ గ్రామాల్లో శ్మశానాలు పూర్తిగా మునిగిపోయాయి. గడిచిన నెల నుంచి నీరు పూర్తిగా చేరి మృతదేహాలు పూడ్చిపెట్టడం వీలు కావడం లేదు. గుంత తవ్వినా తక్షణమే గుంతలో నీరు చేరి మృతదేహం పూడ్చడానికి వీలు కావడం లేదని, కర్మకాండలకు ఈ ఇబ్బందులు ఏమిటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలామంది పొలాల్లో మృతదేహాలను పూడుస్తున్నారు. ఓ మహదేవా ఈ దేహం ఎక్కడ పూడ్చాలో చెప్పయ్యా అంటూ శివుడిని కోరుతున్నారు. ఆదివారం మగాల గ్రామంలో మరణించిన ఒక వ్యక్తి మృతదేహం పూర్చడానికి బంధువులు చాలా ఇబ్బంది పడ్డారు. నదినీరులోనే నడుచుకుంటూ ఏక్కడో ఒక చోట వద్దున పూడ్చి పెట్టారు. అయితే మృతదేహం కొన్ని గంటలకే నీటిలో తేలిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మరో చిరుత సంచారం..!

- కుక్కపై దాడితో గ్రామంలో ఆందోళన

రాయచూరు సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని డొంగరాంపూర్ గుట్ట పై సోమవారం మరో సారి చిరుత సంచారం కనిపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. డొంగరాంపూర్ మామిడిదొడ్డి మధ్యగల పొలంలో కుక్క పై దాడి చేసి చంపి వేయడంతో చిరుత సంచరిస్తున్న విషయం బయటికి పొక్కింది. చిరుత సంచరించిన జాడలు అక్కడ కనిపించడంతో గ్రామస్థులు పొలాలకు వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. మూడు నెలల క్రితం డొంగరాంపూర్ పరమేశ్వర గుట్ట పై చిరుత ఒకటి నెమలి కుక్కల పై దాడి చేసి చంపివేయగా అటవి శాఖ అధికారులు బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించారు. తిరిగి మూడు నెలల అనంతరం చిరుత సంచారం కలకలం రేపుతోంది.


చిరుత సంచరించిన జాడలు

బెదిరించి కేసు పెట్టించారు

- పోలీసులను చూసి భయపడింది
- ముందే పని మానేసిన మహిళ
- ప్రజ్వల్‌ను వివాదం నుంచి తప్పించాలి
- హైకోర్టులో పిటిషన్



బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ప్రజ్వల్ కేసును తిరిగి విచారించాలని, అత్యాచారానికి గురయినట్లు ఆరోపిస్తున్న మహిళను బలవంతంగా ఒప్పించి కేసు పెట్టించారని ఆయన తరఫు న్యాయవాదులు హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ప్రత్యేక న్యాయస్థానం విధించిన యావజ్జీవ కారాగారశిక్షను రద్దు చేయాలని, ఈ వివాదం నుంచి ప్రజ్వల్‌ను తప్పించాలని వారు పిటిషన్ లో పేర్కొన్నారు. అత్యాచారానికి గురైనట్లు చెబుతున్న మహిళ ఫాంహౌస్‌లో ఉన్నప్పుడు పోలీసులు వెళ్లారని, వారిని చూసి భయపడి పరుగెత్తే ప్రయత్నం చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. పోలీసులు ఆమెను సిట్ కార్యాలయానికి తీసుకొచ్చి బెదిరించి కేసు పెట్టించారన్నారు. 2021 జనవరి నుంచి 2022 జనవరి దాకా బసవనగుడి ఇంట్లో అత్యాచారం జరిగిందని ఆరోపించారన్నారు. 2022లో పని వదిలేసినట్లు చెప్పారని, కానీ పోలీసులు 2024 మే 10న పరుపుపై ఉండే మరకలను ఎఫ్ఎస్ఎల్‌కు పంపి ఆమెకు సంబంధించినవిగా చెబుతున్నారన్నారు. మూడేళ్లకాలం పరుపులపై బట్టలు మార్చకుండా ఉండడం సాధ్యమా..? అని ప్రశ్నించారు. కేసులో పలు తప్పిదాలు ఉన్నాయని పిటిషన్ లో పేర్కొన్నారు.

స్పీడు అందుకోని రైళ్లు

- అంచనాలకు దూరంగా 'మిషన్ రఫ్తార్'
- వందే భారత్ రైళ్ల వేగాలూ దయనీయమే..!
- వేగానికి తగ్గ సదుపాయాలు లేని స్థితి

గుంతకల్లు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైళ్ల వేగాలను పెంచడానికి కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మిషన్ రఫ్తార్' అంచనాలను అందుకోలేకపోతోంది. ప్రయాణికుల రైళ్లు, గూడ్సు రైళ్ల సగటు వేగాన్ని 25 కి.మీ.ల మేర పెంచడానికి దాదాపు పదేళ్ల కిందట మిషన్ రఫ్తార్ పేరుతో పంచవర్ష ప్రణాళికను కేంద్రం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా డీఆర్‌ఎంలు, సాంకేతిక సిబ్బందిని ఇటలీ, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలకు పంపి అక్కడ వేగంగా నడుస్తున్న రైళ్లు, రైల్వే వ్యవస్థపై అవగాహన కల్పించారు. భారత రైల్వేలోనూ 150 కి.మీ.ల వేగాన్ని సాధించాలన్న లక్ష్యంతో లక్షల కోట్ల రూపాయలు వెచ్చించారు. ఈక్రమంలోనే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, అధునాతన రైళ్లను ప్రవేశపెట్టడం, ట్రాక్ రెన్యువల్, డబ్లింగ్, ట్రిపుల్ లైన్ల నిర్మాణం, లైన్ల విద్యుద్దీకరణ, పాత తరం ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను తేవడం, డీజిల్ ఇంజన్ల స్థానంలో విద్యుత్తు రైళ్లను ప్రవేశపెట్టారు. ఇన్ని మార్పులు చేసినా అనుకున్న లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోతున్నారు.

లక్ష్యం ఇలా..

2016-17 ఆర్థిక సంవత్సర రైల్ బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మిషన్ రఫ్తార్ పేరిట రైళ్ల వేగాలను పెంచడానికి పథకాన్ని ప్రకటించారు. అప్పట్లో ప్రయాణికులను చేరవేసే రైళ్ల సగటు వేగం గంటకు 46.3 కి.మీ.లు ఉండగా, గూడ్సు రైళ్ల సరాసరి వేగాలు 24.2 కి.మీ.లుగా ఉండేవి. ఎక్స్‌ప్రెస్ రైళ్లను సగటున గంటకు 75 కి.మీ.ల వేగాన్ని, గూడ్సు రైళ్లను సగటున 50 కి.మీ.ల వేగంతో నడపడానికి సంకల్పించారు. అప్పటినుంచి పలు రూట్లలో లైన్లను డబుల్/ట్రిపుల్ చేయడం, విద్యుద్దీకరించడం చేశారు. రైల్ ట్రాక్‌ను రీప్లేస్ చేశారు. దాదాపు 98 శాతం లెవెల్ క్రాసింగ్‌లను తొలగించారు. పలు జంక్షన్లలో బైపాస్ లైన్లను నిర్మించారు. వందే భారత్, హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లాంటి అధునాతన రైళ్లను తెచ్చారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో వాడి-గుంతకల్లు-తిరుపతి రూటులో రైళ్లను 130 కి.మీ.ల వేగంతో టెస్ట్ రన్ చేశారు. కొన్నాళ్లు రైళ్లను ఆ వేగంతో నడిపారు కూడా. కానీ కార్యాచరణలో పరిమితులు అర్థమై 130 కి.మీ.ల వేగం అనే మాటను పలకడం మానేశారు. అంచనాల ప్రకారం ఎక్స్‌ప్రెస్ రైళ్ల సగటు వేగాలను గంటకు 75 కి.మీ. లక్ష్యం ఉండగా ఆచరణలో మాత్రం సగటు వేగాలను 60 కి.మీ.లను దాటించలేకపోయారు. డివిజన్ మీదుగా వెళ్లే దురంత ఎక్స్‌ప్రెస్‌ల వేగాలు దయనీయంగా ఉన్నాయి. అతి వేగంగా వెళ్లే బెంగళూరు-హజ్రత్ నిజాముద్దీన్ (ఢిల్లీ) వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ సగటు వేగం సైతం 71 కి.మీ.లుగా ఉండటాన్ని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వందే భారత్ రైలు మాత్రమే సగటున 74 కి.మీ.లో లక్ష్యానికి కాస్త దగ్గరగా నడుస్తోంది.

వాస్తవ పరిస్థితులివీ..

దేశంలో 1.35 లక్షల కి.మీ.ల పొడవు కలిగిన రైల్ ట్రాక్ 150 కి.మీ.లు కాదుకదా కనీసం 130 కి.మీ.ల వేగంతో నడిచే స్థాయి నాణ్యతలో లేకపోవడం ఈ వైఫల్యానికి ఓ కారణంగా చెప్పవచ్చు. గడచిన పదేళ్ల కాలంలో కొత్త లైన్ల నిర్మాణం, ట్రాక్ రెన్యువల్స్ మొత్తం ట్రాక్ నిడివితో పోలిస్తే 20 శాతానికి మించదు. దేశ జనాభాకు తగినట్లు రైళ్ల సంఖ్యను పెంచాల్సి వస్తుండటంతో రైళ్ల వేగాలను పెంచలేని పరిస్థితి కూడా నెలకొని ఉంది. కొన్ని హైస్పీడ్ రైళ్లను నడపాలంటే మరెన్నో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ట్రాక్ సరిగా లేని కారణంగా అతి వేగంతో రైళ్లను నడిపితే ప్రమాదాలకు దారితీసే పరిస్థితులున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అధునాతనమైన లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లను సమకూరుస్తున్నా, పెరంబూరులో తయారవుతున్న పాతతరం ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) కోచ్‌లను పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇంకా వినియోగిస్తున్నారు. ఈ పాతతరం కోచ్‌లు ఎక్కువ బరువుగా ఉండి, వేగంగా నడిచే సామర్థ్యం లేకపోవడం కూడా రైళ్ల వేగానికి బ్రేక్‌గా భావించాలి. విదేశాల్లో వేగంగా వెళ్లే రైళ్లకు ఆటోమేటిక్ డోర్ సిస్టం ఉంటుంది. మన దేశంలో వందేభారత్, మెట్రో, సబ్‌వే రైళ్లకు మాత్రమే అలాంటి సదుపాయం ఉంది. కొత్త ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో కూడా ఆటోమేటిక్ డోర్ వ్యవస్థ లేకపోవడంతో ప్రయాణికుల భద్రత కోసం రైళ్లను వేగంగా నడపడం సాధ్యం కావడం లేదు. పైగా హైస్పీడ్ రైళ్ల నిర్వహణ అత్యంత ఖర్చుతో కూడుకున్నది. దీంతో చార్జీలు పెరిగి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉంది.



పరిమితులున్నా..

ఇన్ని పరిమితుల కారణంగా మిషన్ రఫ్తార్ కార్యక్రమం లక్ష్యాన్ని అందుకోలేకపోతోంది. అయితే గత కొన్నేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనుల వల్ల 46 కి.మీ.ల సగటు వేగంతో వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇప్పుడు దాదాపు 60 కి.మీ.ల సగటుతో వెళ్లగలుగుతున్నాయి. మూడు వందల కి.మీ.ల దూరం ప్రయాణించే రైళ్ల ప్రయాణ కాలం దాదాపు 2 గంటల ఆదా అవుతోంది. దీని వల్ల పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యస్థానాలను పెంచగలిగారు. ప్రయాణికుల ఆక్యుపెన్సీ పెరిగిన కారణంగా పలు రైళ్ల ఫ్రీక్వెన్సీ కూడా పెంచారు. వారపు రైళ్లను బైవీక్లీ రైళ్లుగా మార్చడం, బై వీక్లీ రైళ్లను ట్రైవీక్లీ రైళ్లుగా అప్‌గ్రేడ్ చేయడం, మరికొన్నింటిని డెయిలీ రైళ్లుగా మార్చారు. అంచనాల మేరకు కాకున్నా మిషన్ రఫ్తార్ వల్ల కొంతమేర ప్రయోజనం చేకూరింది.



ఈ నెల 27న అనంతలో రైలు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

కొన్ని రైళ్ల వివరాలు

ఎక్స్‌ప్రెస్/ సూపర్ ఫాస్ట్ రైలు	ప్రయాణ సమయం	ప్రయాణ హాల్టులు	దూరం	సగటు వేగం
1. బెంగళూరు-హజ్రత్ నిజాముద్దీన్ (ఢిల్లీ) రాజధాని ఎక్స్‌ప్రెస్ (22691)	33-30 గంటలు	14	2,367 కి.మీ.	71 కి.మీ.
2. తిరుపతి-జమ్ముతావి హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (22705)	44-50 గంటలు	12	2,985 కి.మీ.	67 కి.మీ.
3. చెన్నై-ముంబై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12164)	21-30 గంటలు	24	1,261కి.మీ.	59 కి.మీ.
4. తిరుపతి-నిజామాబాద్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (12793)	15-55 గంటలు	26	893 కి.మీ.	56 కి.మీ.
5. కలబురగి (గుల్బర్గ)-బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (22232)	4-25 గంటలు	3	266 కి.మీ.	60 కి.మీ.
6. కాచిగూడ-యశ్వంతపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20703)	8-15 గంటలు	4	612 కి.మీ.	74 కి.మీ.
7. మైసూరు-జైపూర్ ఎక్స్‌ప్రెస్ (12975)	36-05 గంటలు	34	2035 కి.మీ.	56 కి.మీ.
8. మైసూరు-వారణాసి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22687)	48-55 గంటలు	32	2707 కి.మీ.	51 కి.మీ
9. బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464)	29-10 గంటలు	44	1,548 కి.మీ.	53 కి.మీ.
10. మైసూరు-బాగల్‌కోట్ బసవ ఎక్స్‌ప్రెస్ (17808)	21-40 గంటలు	36	1,018 కి.మీ.	47 కి.మీ.

నియోజకవర్గానికో బ్రాంచ్

డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు



సభలో మాట్లాడుతున్న నెట్టెం వెంకటేశులు, పక్కన కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికో బ్రాంచ్, గోడౌన్‌లు ఏర్పాటు చేసి రైతులకు సేవలందిస్తామని డీసీఎంఎస్ (అనంతపురం ఉమ్మడి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ) చైర్మన్ నెట్టెం వెంకటేశులు తెలిపారు. సోమవారం స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయంలో మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్ట్‌ను ప్రవేశపెట్టారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరం వ్యాపార ప్రగతిని ఆయన సమీక్షించారు. రైతులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన ఎరువులు సబ్సిడీ ధరలకు అందజేస్తామని తెలిపారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని సొసైటీలను సంస్థాగతంగా బలోపేతం చేస్తామని, సొసైటీల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మునికృష్ణారెడ్డి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయ్‌భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ అధికారి సుధాకర్‌రెడ్డి, ఏపీ రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్‌సీ పరమేష్, ఉమ్మడి జిల్లాలోని సొసైటీల చైర్మన్లు పాల్గొన్నారు.

సొసైటీల స్థలాలను కాపాడుకోవాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల (ప్యాక్స్) చైర్మన్లు సోమవారం తెలిపారు. ఈమేరకు వారు ఏడీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశులును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమార్, డీఎల్‌సీఓ వెంకటరామిరెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఏడు వికెట్లతో చెలరేగిన ధనుష్



ధనుష్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు బౌలర్ ధనుష్ ఏడు వికెట్లు పడగొట్టి తన జట్టును గెలిపించాడు. హిందూపురంలో సోమవారం జరిగిన అండర్-15 జిల్లాస్థాయి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఎంవైసీఏ అకాడమీ జట్టును తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు 120పరుగుల భారీ తేడాతో ఓడించింది. టీసీఏ బౌలర్ ధనుష్ 4ఓవర్లలో 8 పరుగులు మాత్రమే ఇచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. దీంతో టీసీఏ జట్టు సెమీఫైనల్‌కు చేరింది.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీజీ చదువుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారత అధికారి రెడ్డి బాలాజీ సోమవారం ఒక్రపకటనలో కోరారు. రెన్యువల్, ఫ్రెష్ ఉపకార వేతనాలకు ఈనెల 30లోగా దరఖాస్తు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. ఈప్రక్రియను స్థానిక సచివాలయాల్లో పరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు.

లక్ష్యం సాధించే వరకు విస్మరించేది లేదు

●ఎయిమ్స్ సాధన కమిటీ కన్వీనర్ బసవరాజ కళస



నిరసనలో ప్రజాసంఘాల నాయకులు

రాయచూరు సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కల్యాణ-కర్ణాటక ప్రాంతంలో రాయచూరు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్ మంజూరు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎయిమ్స్ సాధన కమిటీ కన్వీనర్ బసవరాజ కళస అన్నారు. జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోరుతూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష సోమవారం నాటికి 1236వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యావంతులు, వివిధ సంఘ సంస్థల ప్రతినిధులు శిబిరంలో పాల్గొని పోరాట సమితి నాయకులకు సంఘీభావం ప్రకటించారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ విభేదాలను విడనాడి రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

హక్కుల సాధనే ధ్యేయం

ఏపీఎన్‌జీఓ సభ్యత్వ నమోదులో ఉద్యోగ సంఘాల నేతలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'ఏ ప్రభుత్వానికి మనం తొత్తులు కాదు. హక్కుల సాధనే ధ్యేయంగా ముందుగా సాగాలి' అని పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ హోంలో సోమవారం ఏపీఎన్‌జీజీఓ సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎన్జీఓ నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐక్యతగా సభ్యత్వం తీసుకోవడంతోనే ఏపీఎన్‌జీజీఓ విస్తరణ అవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో హక్కుల సాధన కోసం లక్ష మంది ఉద్యోగులు ఉద్యమానికి శ్రీకారం చుడితే జగన్ పోలీసులతో అణచివేశాడన్నారు. అదే చంద్రబాబు అయితే ఉద్యోగులను చర్చలకు పిలుస్తాడన్నారు. హక్కుల సాధన కోసం అక్టోబరులో నిర్వహించే ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.న్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఏపీ సాధించాలన్న ఏపీఎన్‌జీఓ తోనే సాధ్యమన్నారు. ఏపీఎన్‌జీజీఓ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘంలో మెంబర్‌షిప్ తీసుకుని సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నగరశాఖ ఆధ్వర్యంలో భారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి సభ్యత్వాలను తీసుకున్నారు. సమావేశంలో ఏపీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ జమీలా బేగం, కమర్షియల్ ట్యాక్స్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌బాబు, అగ్రికల్చర్ ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఆర్టీసీ ఎంప్లాయీస్ చైర్మన్ సూరిబాబు, ఎస్టీయూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యం: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా పోలీసులు పని చేస్తున్నారని ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం ఒక్రపకటనలో తెలియచేశారు. గత ఏడాది జూన్ నుంచి ఈఏడాది సెప్టెంబరు వరకు 110 కేసులు నమోదుకాగా అందులో 79 పోక్సో, మిగిలిన 31 మిస్సింగ్ కేసులుగా నమోదై తర్వాత పోక్సో కేసులుగా మారాయన్నారు. రామగిరి మండలం పోక్సో కేసుకు సంబంధించి నిందితులను జైలుకు పంపినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. పోలీసులు న్యాయం చేస్తారనే నమ్మకంతోనే బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిపారు. పోక్సో కేసుల విషయంలో అసత్యప్రచారాలు సరికాదన్నారు.

సెక్టోరల్స్ జాబితా విడుదల

అనంతపురంవిద్య, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పడింది. ఎన్నో వివాదాలు, అభ్యంతరాలతో ఏడాదికిపైగా నానుతూవచ్చిన సమగ్రశిక్షలో సెక్టోరల్స్ ఎంపిక పూర్తయ్యింది. ఆమేరకు ఎంపికైన సెక్టోరల్స్ జాబితాకు కమిషనర్ విజయరామరాజు ఆమోదం వేసి పంపగా, డీఈఓ ప్రసాద్‌బాబు జాబితాను ప్రకటించి సోమవారం ఆర్డర్లు ఇచ్చారు.

ఎంపికైన వారు వీరే..

ఐఈఆర్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో పెండింగ్ పెట్టారు, ప్రస్తుతం ఐదుసెక్టోరల్స్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసి ప్రకటించారు. అందులో ఏఎస్‌ఓగా ఎన్. నరసింహారెడ్డి(పిజిక్స్‌టీచర్,దేవగిరి జడ్పీహెచ్‌ఎస్), అసిస్టెంట్ సీఎంఓగా కె.చంద్రశేఖర్(ఎంపీపీస్కూల్, యర్రగుంట్ల, గార్లదిన్నె), ఏఎంఓగా పి.వేణుగోపాల్ (జడ్పీహెచ్‌ఎస్, గోనబావి), అలెస్కోగా కె.రామచంద్ర (పీఎస్‌హెచ్‌ఎం, రాయలప్పదొడ్డి), బి.నారాయణస్వామి (ఎంపీపీఎస్, కోటంక, గార్లదిన్నె) నియమితులయ్యారు.

4న కులగణనపై జిల్లాస్థాయి సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

అనంతపురం విద్య, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జనగణనతోపాటే రాష్ట్రంలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 4న జిల్లాస్థాయి సదస్సు ఏర్పాటు చేసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం వారు నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా 5 నుంచి 15శాతంలోపు ఉన్న అగ్రకులాలే రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాయన్నారు. 50నుంచి 70 శాతం ఉన్న బీసీ కులాలు చిన్నచిన్న పదవులకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీకులాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికే అక్టోబరు4న జిల్లాస్థాయి సదస్సు రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐనాయకులు రాజారెడ్డి, మల్లికార్జున, సంజీవప్ప, శ్రీరాములు, కేశవరెడ్డి, గోవిందు, రంగయ్య, కుళ్లాయిస్వామి, పార్వతి, ప్రసాద్ పాల్గొన్నారు.

పెళ్లికి వచ్చి పరలోకాలకు..

ఈత కోసం వెళ్లి ఇద్దరు కర్ణాటక యువకుల మృతి



బాబ్జాన్, మున్వర్‌బాషా మృతదేహాలు

మడకశిర టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహానికి హాజరైన కర్ణాటకకు చెందిన ఇద్దరు యువకులు స్విమ్మింగ్‌లో మునిగి మృతి చెందిన సంఘటన సోమవారం మడకశిరలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం హాసన్‌కు చెందిన బాబ్జాన్(35) మున్వర్ బాషా(27) మడకశిరలో ఆదివారం జరిగిన తమ బంధువుల వివాహానికి హాజరయ్యారు. పెళ్లి కార్యక్రమం ముగిసిన మరుసటి రోజు సోమవారం సరదాగా సమీపంలోని అక్కంపల్లి వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్ వద్దకు ఈతకు వెళ్లారు. అక్కడ యువకులతో పాటు బంధువులు సరదాగా దాదాపు గంటసేపు ఈత కొట్టారు. బంధువుల్లో చాలా మంది స్విమ్మింగ్‌పూల్ నుంచి బయటకు వెళ్లిపోయినా బాబ్జాన్, మున్వర్‌బాషా అలాగే ఈత కొడుతూ ఉండిపోయారు. అయితే ఉన్నట్లుండి ఇద్దరూ మునిగిపోయారు. అక్కడే ఉన్న బంధువులు ఇది గమనించి, సరదాగా మునిగారేమోనని మిన్నకుండిపోయారు. ఐదారు నిమిషాలు గడిచినా బయటకు రాకపోవడంతో వారు స్విమ్మింగ్‌పూల్‌లోకి దిగి ఇద్దరినీ బయటకు తెచ్చారు. అప్పటికే కడుపు ఉబ్బి ఇద్దరూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని, మృతదేహాలను ఆస్పత్రికి తరలించినట్లు సీఐ నాగేష్ బాబు తెలిపారు. కాగా బాబ్జాన్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, మున్వర్ బాషా కూలీగా పని చేసేవాడని బంధువులు తెలిపారు. బాబ్జాన్‌కు వివాహం కాగా, మున్వర్ బాషా అవివాహితుడని వెల్లడించారు.

ఆర్డీటీని ఇబ్బంది పెట్టడం సరికాదు: సీపీఐ



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న రామకృష్ణ, నాయకులు

బత్తలపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరికాదని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రోగులు, ప్రజలతో ఆర్డీటీ సేవలపై ఆరా తీశారు. 1969 నుంచి ఆర్డీటీ సంస్థ తన సేవలతో ఉమ్మడి జిల్లాలో ఒక మినీ ప్రభుత్వంలా పని చేసిందన్నారు. అలాంటి సంస్థకు మతాన్ని అంటగట్టి ఇబ్బంది పెట్టడం తగదన్నారు. విద్యా, వైద్యం ద్వారా ఎన్నో పేద కుటుంబాలకు ఊరట కలిగించిందన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌లు స్పందించి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిషాలపై ఒత్తిడి తెచ్చి ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి వేమయ్య, నాయకులు మధు, కాటమయ్య, జింకా చలపతి, కాటమయ్య, వెంకటేసు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ హృదయరాజు



చలో విజయవాడ పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హృదయరాజు, ఫ్యాప్టో నేతలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం అక్టోబరు 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ హృదయరాజు పిలుపునిచ్చారు. చలో విజయవాడ పోరుబాట సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం అనంతపురం వచ్చారు. ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా ఫ్యాప్టో(ఉపాధ్యాయసంఘాలు) నేతలతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. గత ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అనేక హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పండుగపూట కూడా ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలలో కడుపు నింపడంలేదన్నారు. ఈ పరిస్థితి మారాలంటే పోరుబాట తప్పదని పేర్కొన్నారు. సమావేశంలో ఫ్యాప్టో నేతలు శ్రీనివాసనాయక్, పురుషోత్తం, రమణారెడ్డి, సిరాజుద్దీన్, రాయల్‌వెంకటేష్, కులశేఖరరెడ్డి, లింగమయ్య, వెంకటరత్నం, గోపాల్‌రెడ్డి, సూర్యుడు, లింగమూర్తి, వెంకటసుబ్బయ్య, రవీంద్ర, రఫీ, వెంకటరెడ్డి, రామాంజినేయులు, సరిత, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, నాగరాజు, ఖాన్, జార్జ్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ సేవలు మరువలేనివి : ఏఐడీఎస్‌ఓ



భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కంప్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ సేవలు మరువలేనివని ఏఐడీఎస్‌వో జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతి తెలిపారు. కురుగోడు సమీపంలోని సోమలాపురం గ్రామంలో విద్యార్థులు ఏఐడీఎస్‌వో ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జన్మదినోత్సవ వేడుకలు జరిగాయి. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట మహా విప్లవకారుడు భగత్‌సింగ్ అన్నారు. భగత్‌సింగ్ ఆలోచనలు ప్రతిచోటా వ్యాపించాయి. మన ఆదర్శం భగత్‌సింగ్ ఆయన కలల భారతదేశాన్ని నిర్మించడానికి సూచిస్తున్నాయి. భగత్‌సింగ్ జయంతిని జరుపుకుని మనం నివాళులర్పించడమే కాకుండా ఆయన మరణించిన విప్లవం విజయవంతమైందో లేదో కూడా ఆలోచించాలన్నారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్‌వో సోమలాపురం గ్రామ సమితి కార్యదర్శి అంకిత, సభ్యులు జయశ్రీ, రాధిక ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

రూమి (జయంతి)




మౌలానా రూమిగా పేరొందిన పర్షియన్ దేశానికి చెందిన కవి, ఇస్లామిక్ స్కాలర్ జలాలుద్దీన్ ముహమ్మద్ రూమి 1207 సెప్టెంబరు 30న ఆఫ్ఘనిస్థాన్‌లో జన్మించారు. టర్కిష్, అరబిక్, గ్రీకు భాషలతో కూడిన ఆయన రచనలు ప్రపంచవ్యాప్తంగా పలు భాషలలోకి తర్జుమా అయ్యాయి. ప్రత్యేకించి సూఫీయిజం బోధనలో తనదైన గుర్తింపు పొందారు. 1273 డిసెంబరు 17న కన్నుమూశారు.

లాహిరి మహాశయ (జయంతి)



'క్రియా యోగ'లో గుర్తింపు పొందిన లాహిరి మహాశయ 1828 సెప్టెంబరు 30న పశ్చిమబెంగాల్ రాష్ట్రం నాడియా జిల్లాలో ఘుమి ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు శ్యామాచరణ్ లాహిరి. మహావతార్ బాబాజీకి శిష్యుడు. భారతీయ యోగులలో విలక్షణమైన వ్యక్తి. అనుచరులు ఆయనను 'మహాశయ'గా పిలుస్తారు. యుక్తేశ్వర్ గిరికి గురువు. ఆధ్యాత్మిక, ప్రాణాయామాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరింపచేశారు. 1895 సెప్టెంబరు 26న మహాసమాధి అయ్యారు.

హృషికేశ్ ముఖర్జీ (జయంతి)




'పద్మవిభూషణ్' హృషికేశ్ ముఖర్జీ 1922 సెప్టెంబరు 30న కోల్కాత్తాలో జన్మించారు. సినీ దర్శకుడు, ఎడిటర్, రచయితగా రాణించారు. 'హృషి-దా'గా పేరొందారు. నాలుగు దశాబ్దాలలో 42 సినిమాలకు దర్శకత్వం వహించారు. దాదాసాహెబ్‌ఫాల్కే, ఎన్టీఆర్ నేషనల్ అవార్డ్, 8 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. 2006 ఆగస్టు 27న కన్నుమూశారు.

గణపతి స్థపతి (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత వైద్యనాథ గణపతి స్థపతి 1927 సెప్టెంబరు 30న తమిళనాడు రాష్ట్రం కారైకుడి ప్రాంతంలో జన్మించారు. వాస్తుశాస్త్రాన్ని విస్తృతం చేశారు. కళాశాలలో ఆర్కిటెక్చర్ అండ్ స్కల్ప్చర్ విభాగాధిపతిగా వ్యవహరించారు. తిరువళ్ళువర్ విగ్రహ రూపకల్పనతో జాతీయంగా పేరొందారు. ఎన్నో ఆలయాలు, భవనాల డిజైన్‌లకు రూపకల్పన చేశారు. కలైంజ్ఞర్, తదితర పురస్కారాలు పొందారు. 2011 సెప్టెంబరు 5న కన్నుమూశారు.

శంకర్‌నాగ్ (వర్ధంతి)



ప్రముఖ కన్నడ నటుడు, దర్శకుడు శంకర్‌నాగ్ 1954 నవంబరు 9న మైసూరులో జన్మించారు. బుల్లితెరపైనా, వెండితెరపైనా స్క్రీన్‌రైటర్‌గా, నిర్మాత గాను రాణించారు. ఆయన దర్శకత్వం వహించి నటించిన 'మాల్గుడి డేస్' ఎంతో పేరొందింది. అన్న అనంత్‌నాగ్‌తోకలసి నాటకరంగానికి ఎంతో కృషి చేశారు. పలు అవార్డులు పొందారు. 35వయేట 1990 సెప్టెంబరు 30న కారు ప్రమాదంలో మృతి చెందారు.

మార్టినా హింగిస్ (పుట్టినరోజు)



స్విస్ దేశానికి చెందిన టెన్నిస్ క్రీడాకారిణి మార్టినా హింగిస్ 1980 సెప్టెంబరు 30న జన్మించారు. గ్రాండ్‌స్లామ్ సింగిల్స్‌లో 5సార్లు విజేతగా నిలిచారు. 22వ యేటకే 40 సింగిల్స్ టైటిల్స్, 36 డబుల్స్ టైటిల్స్ సాధించి యంగెస్ట్ ఎవెర్‌గా ప్రత్యేకతగా చాటుకున్నారు. ఐదేళ్లపాటు వరుసగా అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న క్రీడాకారిణిగా నిలవడం గమనార్హం. ఇంటర్నేషనల్ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేంకు ఎన్నికయ్యారు.

దీపా మాలిక్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత దీపా మాలిక్ 1970 సెప్టెంబరు 30న హరియాణలో జన్మించారు. 1999లో ప్రమాదవశాత్తు వెన్నెముక దెబ్బతిని చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. 2016 సమ్మర్ పారాలింపిక్స్‌లో షాట్‌పుట్‌లో వెండి పతకం సాధించి దివ్యాంగులలో స్ఫూర్తి కల్పించారు. జావెలిన్‌త్రో, డిస్కస్ త్రో, స్విమ్మింగ్, మోటర్‌సైక్లింగ్‌లో సత్తా చాటుకున్నారు. రాజీవ్‌ఖేల్‌రత్న, కర్మవీర్ చక్ర, అర్జున అవార్డులు పొందారు.

కోటె సోమేశ్వర ఆలయంలో విశేష పూజలు



స్వామివారికి అలంకరణ

శిడ్లఘట్ట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాతన కోటె సోమశ్వర ఆలయ జీర్ణోద్ధరణ రోజును పురస్కరించుకుని సోమవారం ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. డాల్ఫిన్ విద్యాసంస్థ అధ్యక్షుడు ఏ నాగరాజ్ అధ్యక్షతన ఆలయ అభివృద్ధి సమితి ఏర్పాటైంది. దాతల సహకారంతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. సుందరమైన కళాత్మకతతో ఆలయ కుడిభాగంలో సుబ్రమణ్యస్వామి ఆలయం, అశ్వత్థకట్ట, అర్చకులకు విశ్రాంతిగదులు నిర్మించారు. కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు రూపసి రమేశ్ పర్యవేక్షిస్తున్నారు.



డ్రోన్‌లతో మంత్రి మహదేవప్ప, ఎమ్మెల్యే తన్వీర్‌సేఠ్



గిన్నిస్ రికార్డు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మంత్రి

ఆకాశంలో అమ్మ దర్శనం

బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాల్లో ఈసారి డ్రోన్‌షో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చాముండేశ్వరి విద్యుత్ సరఫరా కంపెనీ (సెస్క్) ఆధ్వర్యంలో బన్నిమంటప మైదానంలో ఆదివారం డ్రోన్ షో ప్రారంభమైంది. సుమారు 3వేల డ్రోన్‌లను ఉపయోగించి కొత్త లోకాన్ని సృష్టించారు. ఇందులో 2,983 డ్రోన్‌ల ద్వారా జాతీయ జంతువు పులిని రూపొందించారు. తద్వారా గొప్ప అనుభూతి మిగిల్చిందని సెస్క్ మేనేజింగ్ డైరెక్టర్ మునిగోపాల రాజు వెల్లడించారు. 2024 ప్రదర్శనలో 1500 డ్రోన్‌లు ఉపయోగించగా ఈసారి రెట్టింపు చేశామన్నారు. ఇందుకోసం డ్రోన్ల ద్వారా విన్యాసాలు రూపొందించేందుకు బృందం ఎంతో శ్రమించిందన్నారు. 200మంది దాకా పాల్గొన్నారు. వీరి శ్రమకు గిన్నిస్ వరల్డ్ రికార్డు దక్కిందన్నారు. ప్రధాన ప్రదర్శనలు అక్టోబరు 1, 2 తేదీలలో మరింతగా సందర్శకులను ఆకట్టుకుంటాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు.



గ్లోబ్‌లో ఇండియా మ్యాప్

డ్రోన్‌లతో పలు విన్యాసాలు

డ్రోన్‌ల ద్వారా సోలార్ సిస్టమ్, వరల్డ్‌మ్యాప్, ఆర్మీ సైనికుడు, నెమలి, డాల్ఫిన్, గద్ద, పాము తలపై నృత్యం చేస్తున్న శ్రీకృష్ణుడు, కావేరి మాత, కర్ణాటక మ్యాప్, ఇంకా సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, రాష్ట్రప్రభుత్వ గ్యారెంటీ పథకాలు, అంబారి మోస్తున్న ఏనుగు, నాడదేవత చాముండేశ్వరి దేవి వంటివి ప్రదర్శించారు. ప్రదర్శనలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప, ఎమ్మెల్యే తన్వీర్‌సేఠ్, ఎమ్మెల్సీ కే శివకుమార్, ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి గౌరవ్‌గుప్త, జిల్లా అధికారి లక్ష్మీకాంతరెడ్డి, జిల్లా పంచాయతీ సీఈఓ ఎస్ యుకేశ్‌కుమార్, సాంకేతిక విభాగం డైరెక్టర్ డీజే దివాకర్, పాలికె కమిషనర్ షేక్ తన్వీర్ ఆసిఫ్, మైసూరు డెవలెప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కేఆర్ రక్షిత్, సెస్క్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.




చేళూరులో లలితా త్రిపుర సుందరి అలంకరణలో వాసవీమాత



ముళబాగిలు తాలూకా కొలదేవిలో గరుడ దేవుడికి అలంకరణ



కత్రిగుప్పె రాజరాజేశ్వరి ఆలయంలో అన్నపూర్ణేశ్వరీ దేవికి గాజుల అలంకరణ



దొడ్డజాల ముత్యాలమ్మదేవికి సరస్వతి అలంకరణ

విద్యార్థులు.. విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి

» కేఎస్ఐటీ తరగతుల ప్రారంభోత్సవంలో ప్రముఖులు

బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖులు అభిప్రాయపడ్డారు. కమ్మ సంఘం స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ మేనేజిమెంట్ కళాశాలలో ఇంజనీరింగ్ 2025-26 అకడమిక్‌ను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. టయోటా ఇండస్ టైం ఇంజన్ ప్రైవేట్ లిమిటెడ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సంతోష్‌రావ్ ముఖ్యులుగా పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కఠిన శ్రమ, నైతిక విలువలతో కూడిన అభ్యాసం చేయాలన్నారు. సాంకేతిక నైపుణ్యత ఉద్యోగాలకు అవకాశం కానుందన్నారు. గౌరవ అతిథిగా కమ్మవారిసంఘం మాజీ అధ్యక్షుడు, అడ్వైజింగ్ కమిటీ చైర్మన్ కే కృష్ణ మాట్లాడుతూ కమ్మవారి సంఘం ఓ ఆలోచనతో విద్యాసంస్థ ప్రారంభించిందని, గుణాత్మకతతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సంస్థ అధ్యక్షులు రాజగోపాలనాయుడు మాట్లాడుతూ కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. గౌరవకార్యదర్శి లీలాశంకరరావు, కోశాధికారి నీరజాక్షులు నాయుడు, ప్రిన్సిపాల్ శివసుబ్రమణ్యంతోపాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తరగతుల ప్రారంభంలో ప్రముఖులు, విద్యార్థులు

దసరాకు మార్కెట్లలో సందడి



కేఆర్ మార్కెట్‌లో అరటి పిలకలు



జయనగర్‌లో బూడిదగుమ్మడికాయల విక్రయాలు

బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరాలో కీలకమైన ఆయుధపూజకోసం నగరంలోని మార్కెట్లు సందడి నెలకొన్నాయి. పూజకు అవసరమైన పూలు, పండ్లధరలు అమాంతం పెరిగాయి. ప్రత్యేకించి దిష్టి తీసేందుకు ఉపయోగించే నిమ్మకాయలు, బూడిద గుమ్మడికాయలు, ముస్తాబు చేసేం దుకు అరటి పిలకలు, అరటిమాన్లు వంటి విక్రయాలు జోరందుకున్నాయి. కేఆర్ మార్కెట్, జయనగర్, మడివాళ, మల్లేశ్వరం, కేఆర్‌పురం, యలహంక తదితర మార్కెట్లలో సందడి నెలకొంది.

దొమ్మసంద్ర ఉపాధ్యక్షురాలిగా గిరిజా మల్లేశ్ ఏకగ్రీవం

దొమ్మసంద్ర, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దొమ్మసంద్ర గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలిగా గిరిజా మల్లేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దివ్యా తన స్థానానికి రాజీనామా చేయడంతో సోమవారం జరిగిన ఎన్నికల్లో గిరిజా మల్లేశ్ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామపంచాయతీలో మొత్తం 32 మంది సభ్యులు ఉన్నారు. ఎన్నికల్లో 23మంది గిరిజాకు మద్దతుగా నిలిచారు. దీంతో ఆమె ఏకగ్రీవమైనట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అధ్యక్షుడు నరేశ్, మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యులు ఉమేశ్‌బాబు, సభ్యులు డీఎస్ నాగరాజు, రాజణ్ణ, నారాయణప్ప, సంతోష్, మోహన్‌బాబు, రాజేశ్, శాంతకుమార్, సరస్వతమ్మ, పద్మావతి, మునీంద్రమ్మ, తాలూకా పంచాయతీ మాజీ సభ్యులు రవీంద్ర, ఏడీపీ అధ్యక్షులు జయణ్ణ, కృష్ణప్ప తదితరులు పాల్గొని అభినందించారు.



గిరిజా మల్లేశ్‌ను అభినందిస్తున్న నాయకులు

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



బొమ్మల కొలువులో స్థానికులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరాను పురస్కరించుకుని ఆలయాలు సహా పలు ఇళ్లల్లో బొమ్మలకొలువు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. తాలూకాలోని మేలూరు గ్రామపంచాయతీ సభ్యుడు రవిప్రసాద్ నివాసంలో ఏర్పాటైన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. అమ్మవారి మూర్తులు, గణపతి, కామధేను, పుట్టలో పాలు తాగుతున్న గోమాత, రాఘవేంద్ర, దశావతారం, 30ఏళ్లక్రితం నాటి శ్రీరాముడు, కృష్ణుల అపురూపమైన బొమ్మలు, శెట్టప్ప, శెట్టమ్మల దుకాణాల నమూనాలు, తోపుడుబండ్లు శివుడికి అభిషేకం, గణపతి వాద్యగోష్ఠి, శ్రీరాముడు వనవాసానికి వెళ్తున్న దృశ్యం, శ్రీరాముడికి పండ్లు ఇస్తున్న శబరి, ఇంకా మైసూరు ప్యాలెస్, అయోధ్య బాలరాముడు, పూరి జగన్నాథ్, బద్రినాథ్, కేదార్‌నాథ్ వంటి రకాల నమూనాలు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బొమ్మల కొలువుకు విశేష పూజలు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మణిపాల్ ఆసుపత్రుల కార్మిక సంఘం ఏర్పాటు

బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): హెచ్ఏఎల్ రోడ్డు కోనేన అగ్రహారలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మణిపాల్ ఆసుపత్రుల కార్మికుల సంఘం ఏర్పాటైంది. సోమవారం సంఘం కార్యాలయాన్ని మాజీ కార్పొరేటర్ చంద్రప్పరెడ్డి ప్రారంభించారు. బాబు దినేశ్ తదితరులు పాల్గొన్నారు. డీఎస్ఎస్ భీంశక్తి రాష్ట్ర అధ్యక్షుడు హెబ్బాళ వెంకటేశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. పలువురు మహిళా కార్మికులు భాగస్వామ్యులయ్యారు.

కార్మికసంఘం సభ్యులు



తెలంగాణ గ్రూప్ పరీక్షల్లో రాణించిన డాక్టర్ శైలజ

బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 సర్వీస్ పరీక్షల్లో బెంగళూరుకు చెందిన డాక్టర్ శైలజ టాపర్‌గా రాణించారు. బెంగళూరులో జన్మించి ఇక్కడే ప్రాథమిక విద్యతోపాటు ఉన్నతవిద్యను అభ్యసించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి సమాజంలో మహిళలకు తనవంతు సేవలు అందించాలని గైనకాలజిస్ట్ కోర్సు చేశారు. ఆ తర్వాత ప్రజాసేవ ద్వారా పేద ప్రజలకు విస్తారంగా సేవలందించే అవకాశం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షల్లో పాల్గొన్నారు. ఎలాంటి కోచింగ్ లేకుండానే ఉత్తమమార్కులు పొందారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా నియామకపుపత్రాన్ని డాక్టర్ శైలజ స్వీకరించారు. గ్రూప్-1 సేవల ద్వారా సమాజంలో వెనుకబడినవర్గాలకు అండగా ఉంటానని శైలజ తెలిపారు. ప్రభుత్వరంగ తెలుగు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎల్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిద్ధం నారయ్య, కార్యదర్శి సంజీవ్‌రావ్, బెంగళూరు తెలుగు సమాఖ్య ప్రధాన కార్యదర్శి సాధ రాఘవేంద్ర, కర్ణాటక బహుజన సమాఖ్య అధ్యక్షుడు జీహెచ్ శంకర్ తదితరులు డాక్టర్ శైలజను ప్రత్యేకంగా అభినందించారు.



డాక్టర్ శైలజ

నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీకి

పదిమంది అధ్యాపకుల ఎంపిక



ఎంపికైన అధ్యాపకులతో పాలకవర్గ సభ్యులు తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ (ఎన్ఈఎస్) ఆఫ్ కర్ణాటక పాలకవర్గానికి పదిమంది అధ్యాపకులు ఎంపికయ్యారు. డాక్టర్ హెచ్ నరసింహయ్య ఆశయాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు డాక్టర్ కృష్ణేగౌడ, డాక్టర్ పద్మినిరావ్, ప్రొఫెసర్ హేమంత్‌రాజ్‌తోపాటు పదిమంది ఎంపికయ్యారు. పాలకమండలిలో 300మంది సభ్యులు ఉన్నారు. ఎన్ఈఎస్ 21 సంస్థలనుంచి 1200మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. గెలుపొందినవారిని ఎన్ఈఎస్ చైర్మన్ డాక్టర్ హెచ్ఎన్ సుబ్రమణ్య, ఉపాధ్యక్షుడు వైజి మధుసూధన్, గౌరవ కార్యదర్శి వెంకటశివారెడ్డి, కార్యదర్శి డీఎస్ అరుణ్‌కుమార్, అసోసియేట్ ఉపాధ్యక్షుడు మంజునాథ్, కోశాధికారి తల్లం ద్వారకనాథ్, జాయింట్ డైరెక్టర్ ఇస్తూరి సుధాకర్, డాక్టర్ పీఎల్ వెంకటరామిరెడ్డి తదితరులు అభినందించారు.

గుండెజబ్బులపై అప్రమత్తత అవసరం



వాకథాన్‌కు పచ్చజెండా ఊపుతున్న దృశ్యం

బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుండెజబ్బులపై అప్రమత్తత ముఖ్యమని మెడికవర్ ఆసుపత్రి ముఖ్యులు నాగశ్రీనివాస్ పిలుపునిచ్చారు. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా వైట్‌ఫీల్డ్‌లో వాకథాన్ నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ప్రారంభించిన వాకథాన్ వివిధ రహదారుల మీదుగా సాగింది. ఈ సందర్భంగా కార్డియాలజిస్ట్ రాఘవేంద్ర చిగటూరు మాట్లాడుతూ 40 ఏళ్లు దాటినవారు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, జీవనశైలిలో మార్పులు తప్పనిసరిగా చేసుకో వాలన్నారు. ప్రతిరోజూ వ్యాయామం, యోగాతోపాటు ఆహార విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వాకథాన్ ద్వారా ప్రజలలో అవగాహన తీసుకురావాలని భావించామన్నారు. ర్యాలీలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న మహిళలు

మహదేవపుర, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వరల్డ్ హార్ట్ డేలో భాగంగా గుండె ఆరోగ్యంపై ఆల్టోర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేఆర్‌పురలో మెగా కార్డియాక్ హార్ట్‌బీట్ వాకథాన్ నిర్వహించారు. సోమవారం ఉదయం 7 గంటలకు వాక థాన్‌ను డాక్టర్ లవీన్‌గౌడ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలికాలంలో గుండె జబ్బుతో బాధపడేవారి సంఖ్య పెరిగిందని విచారం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నడకను అభ్యాసం చేసుకోవాలన్నారు. శరీరానికి కనీస శ్రమ అవసరమన్నారు. క్రమం తప్పని నడక ద్వారా గుండెజబ్బులను దూరం చేసుకోవచ్చునన్నారు. అదే విధంగా వీలైతే క్రీడల్లో పాల్గొని ఉత్సాహంగా ఉండాలన్నారు. కాగా ఆసుపత్రిలో ఉచితంగా ఈసీజీ, రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేస్తున్నామని సద్వినియోగం చేసుకో వాలన్నారు. వాకథాన్‌లో వినాయక్ హాలూరు, హరిణి తదితరులు పాల్గొన్నారు.


వారాహి రూపంలో చిన్నదుర్గమ్మ


సరస్వతీ అలంకారంలో వాసవీమాత


ఎర్రితాతకు నాణేలతో అలంకరణ


దేవీనగర్‌లోని యల్లమ్మతల్లి


తాయమ్మ దేవికి కరెన్సీ నోట్లతో అలంకరణ


ఆనెగొందిలో అమ్మవారు

సరస్వతీ నమోస్తుతే

బళ్లారి సిటీ/రూరల్/కంప్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రుల్లో భాగంగా అమ్మవారు సోమవారం సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. నగరంలోని పలు ఆలయాల్లో వివిధ అలంకారాలతో అమ్మవార్లు దర్శనమిచ్చారు. నగరంలోని పటేల్‌నగర్‌లోని చిన్న దుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవి వారాహి దేవి రూపంలోభక్తులకు దర్శనమిచ్చింది. బెంగళూరులోడ్డులోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవి మాతకు సరస్వతిదేవి అలంకారం, లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మంటపంలో దేవికి సరస్వతి అలంకారం, ఎల్‌ఎల్‌సీ కాలనీ లలితాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకారంతో దర్శనమిచ్చింది. కౌల్‌బజార్‌లోని పెద్దమ్మతల్లికి నవదాన్యాల అలంకరణ, హొసపేటరోడ్డులోని సంతోషిమాతకు విశేషాలంకారం అలంకారం, దేవినగర్‌లోని యల్లమ్మకు సరస్వతిదేవి అలంకారం. మోతి సర్కిల్లోని ఏళుమక్కల దేవికి లక్ష్మీదేవి, నగరంలోని బెంకిమారెమ్మకు కాటన్‌తో అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. సిరుగుప్పలో శరన్నవరాత్రులు పురస్కరించుకుని పేటే ఆంజనేయస్వామికి జాంబవంతుడిగా అలంకార సేవలు చేశారు. భక్తులు ధూపదీప నైవేద్యాలతో పూజలు చేసి మహా మంగళహారతి నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు.

కొట్టుకుపోయిన వంతెన


ధ్వంసమైన రహదారి

రాయచూరు సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మాన్వి తాలూకా ఎస్.హోసూరు గ్రామ సమీపంలోని వాగుపై నిర్మించిన వంతెన సోమవారం మరోసారి కొట్టుకుపోయింది. 6 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన ఇప్పటికి మూడు సార్లు తెగిపోగా అధికారులు తాత్కాలిక మరమ్మత్తులతో చేతులు దులుపుకుంటున్నారు. రోడ్డు ధ్వంసంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

యశ్వంత్ దేశ్‌పాండే కన్నుమూత

బెంగళూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రంగస్థల నటుడు యశ్వంత్ దేశ్‌పాండే (60) సోమవారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. ఆదివారం రాత్రి ధారవాడలో నాటక ప్రదర్శన ముగించుకుని బెంగళూరుకు వచ్చారు. ఛాతీలో నొప్పి రావడంతో ఫోర్టిస్ ఆసుపత్రికి వెళ్లారు. కాసేపటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కన్నడ నాటకరంగంలో 'ఆల్ ది బెస్ట్' నాటిక ద్వారా గుర్తింపు పొందారు. విజయపుర జిల్లా బసవనబాగేవాడి తాలూకా ఉక్కలి గ్రామానికి చెందిన యశ్వంత్ హెగ్గోడిలోని నీనాసం నాటక సంస్థ నుంచి డిప్లమో పొందారు. న్యూయార్క్ విశ్వవిద్యాలయం నుంచి నాటకరచన, సినిమా సంభాషణ విభాగాలలో శిక్షణ పొందారు. బుల్లితెర, వెండితెరపైనా పలు పాత్రలలో నటించారు. 60కుపైగా నాటకాలకు దర్శకత్వం వహించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే జనస్పందన

● నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవు ● నాగేంద్రకు మళ్లీ మంత్రి పదవి ఖాయం: మంత్రి జమీర్

బళ్లారి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందిస్తుందని వసతి, వక్ఫ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అమ్మద్, మాజీ మంత్రి నాగేంద్ర, బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. సోమవారం బళ్లారి జిల్లా డీసీ నూతన కార్యాలయం ఆవరణంలో "జనస్పందన" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే సమస్యలు అక్కడిక్కడే పరిష్కరించారు. బళ్లారి వినాయక్ నగర్ లో చాలా ఏళ్ల నుండి అక్కడ జనం నివాసం ఉంటున్నారు. ఆ స్థలం ప్రజలు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారని అ ప్రాంతంలో ఉన్న ప్రజలు మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించారు. స్థానికులకు అండగా ఉంటామని, ఎవ్వరూ ఖాళీ చేయాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. అతిధి లెక్చరర్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్న ఏబీవీపీ కార్మికులను విజ్ఞప్తిని మంత్రి వెంటనే పరిష్కరిస్తామన్నారు. జిల్లా నుండి అనేక ప్రాంతాల జనం వారి సమస్యలు తెలుపుకునేందుకు జనం పెద్ద సంఖ్యలో వచ్చారు. కార్యక్రమంలో మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, కార్పొరేటర్లు గుమ్మనూరు జగన్, గాదెప్ప, రామాంజనేయులు, కుబేర, లతో పాటు జిల్లా అధికారులు నాగేంద్ర ప్రసాద్, ఐజీ వర్తికా కటియర్, ఎస్పీ శోభారాణి, సీఈవో మహమ్మద్ హరిష్, ఏడీసీ జుబేరా తదితరులు పాల్గొన్నారు. వాల్మీకి నాయకుడు, మాజీ మంత్రి నాగేంద్ర మళ్లీ మంత్రి అయ్యేది ఖాయం అని మంత్రి జమీర్ అమ్మద్ జోష్యం పలికారు. త్వరలో క్యాబినెట్ విస్తరణ ఉంది. అందులో ఆయనకు స్థానం దక్కుతుందని వ్యాఖ్యానించారు.


జనస్పందన వేదికపై నాయకులు, అధికారులు

సాహిత్య సమ్మేళనానికి స్థల పరిశీలన

బళ్లారిలో డిసెంబర్ మాసంలో జరిపే అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం కోసం నగరంలో మూడు స్థలాలను మంత్రి, ఎమ్మెల్యేలు, వివిద శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అనుకున్న సమయంకే సాహిత్య సమ్మేళనం జరుపుతామని మంత్రి తెలిపారు


సాహిత్య సమ్మేళనానికి స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జమీర్ తదితరులు

విధి నిర్వహణలో ఏఎస్ఐ మృతి

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ఏఎస్ఐ మృతి చెందిన సంఘటన అందరికీ కన్నీళ్లు తెప్పించింది. సోమవారం నూతన జిల్లా పాలనా భవనం వద్ద నిర్వహించిన జనతా దర్శన్ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ సబ్ ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాసరావు (52) మృతి విధి నిర్వహణలో ఉండగానే మృతిచెందారు. డ్యూటీ చేస్తున్న సమయంలోనే నేలపై కుప్పకూలగా ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆయనను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీనివాస రావ్ నగరంలోని ఏపీఎంసి పోలీసు స్టేషన్ ఏఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మృతిపై జిల్లా పోలీసు యంత్రాంగం, స్థానిక ప్రజా ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.


శ్రీనివాసరావు(ఫైల్)


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

సరళాదేవి కళాశాలలో 'జ్ఞానసించన'

బళ్లారి సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని సరళాదేవి సతీశ్చంద్ర అగర్వాల్ ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో సోమవారం 'జ్ఞానసించన' పేరుతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, కళాశాల అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని నగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ కళాశాలలో అత్యధికంగా పేద విద్యార్థులు చదువుతున్నారని, రూ.7కోట్ల గ్రాంట్ అందించామన్నారు. కళాశాలలో కోటిన్నర రుపాయల ఖర్చుతో మీటింగ్ హాల్ నిర్మిస్తున్నామన్నారు. ఈకళాశాల అభివృద్ధికి ఎల్లప్పుడు సహకరిస్తానన్నారు. కళాశాల సమగ్ర అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రహ్లాద్ చౌదరి మాట్లాడుతూ కళాశాలలో 3వేలకు పైగా విద్యార్థులు ఉన్నారని, కళాశాలకు ఎమ్మెల్యే రూ.ఐదుకోట్లు గ్రాంట్ అందిందన్నారు. రూ.10కోట్ల గ్రాంట్ ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సంఘం సమన్వయకర్త అధ్యాపకుడు గురుబసప్ప పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహిస్తున్న కార్యకలాపాలను వివరించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ హెగ్డే, పూర్వ విద్యార్థుల ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కిషోర్ కుమార్, కోశాధికారి వీరభద్రగౌడ, ఉపాధ్యాక్షుడు ఆనంద్‌కుమార్. రఫీ, రామస్వామి,అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ప్రొఫెసర్లకు విశిష్ట శాస్త్రవేత్త హోదా




స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం గుర్తింపు పొందిన ముగ్గురు ప్రొఫెసర్లు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ప్రఖ్యాతి గాంచిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఏటా ప్రకటించే ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తల జాబితాలో ముగ్గురు బళ్లారి ప్రొఫెసర్లు ఉన్నారు. వీరు విజయ నగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో కొప్పళ జిల్లా గణిత శాస్త్ర విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ కేవీ ప్రసాద్ ఏకంగా ఐదవ సారి దక్కించుకోవడం విశేషం. గణితం, కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ హనుమేష్ వైద్య వరుసగా మూడోసారి, రసాయన శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె.ఎస్.లోకేష్ మొదటి సారిగా చోటు దక్కించుకున్నారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఏటా ప్రపంచంలో అత్యుత్తమ పరిశోదకుల జాబితాను వెబ్‌సైన్స్ స్కోవస్, గూగుల్ స్కాలర్, హెచ్.ఇండెక్స్, ఇంపాక్ట్ సైటేషన్, మరిన్నిటిని కలయిక ఆధారంగా విడుదల చేస్తుంది. ప్రపంచ స్థాయి నాణ్యత గత పరిశోధనా కథనాలను గుర్తిస్తుంది. ప్రామాణికమైన పరిశోధనా పత్రాలను ప్రచురించడంలో ప్రసిద్ధి చెందిన ఎల్సెవియర్ సంస్థతో భాగస్వామ్యంతో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం గత వారం ఆ జాబితాను విడుల చేసింది. ప్రపంచంలోని అగ్రశ్రేణి పరిశోధకులను పరిశోదనకు సంబంధించి వివిధ వర్గాలుగా వర్గీకరించడం ద్వారా ఈ జాబితాను ఖరారు చేశారు. వీఎస్‌కేయూ వీసీ ఎం.మునిరాజ్, కొప్పళ్ విశ్వవిద్యాలయం కులపతి ప్రొఫెసర్ బి.కె.రవి, రిజిస్ట్రార్ సి.నాగరాజు, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు వారిని అభినందించారు.

హోసూరు జోన్


పనులను ప్రారంభిస్తున్న మేయర్ సత్య

వార్డుల్లో స్వచ్ఛత పనులు ప్రారంభం

హోసూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలే వేళ హోసూరు కార్పొరేషన్ యంత్రాంగం ముందస్తు చర్యలకు సిద్ధమైంది. వార్డులలో స్వచ్ఛతా పనులు చేపడుతున్నారు. ప్రతిరోజూ కనీసం 3 వార్డులలో 30 కార్మికులు పొక్లైనర్‌లతో స్వచ్ఛతా చర్యలు నిర్వహిస్తున్నారు. రాబోయే 15రోజులలో 45 వార్డులలో స్వచ్ఛతా పనులు పూర్తి చేయనున్నట్టు మేయర్ సత్య తెలిపారు. పనులు ప్రారంభం సందర్భంగా హోసూరు కమిషనర్ షబ్బీర్ ఆలం, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ప్రజారోగ్య కమిటీ మాదేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు రేబిస్ టీకాలు

హోసూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలో ఇటీవల వీధికుక్కల బెడది అధికమైంది. వీధికుక్కల కాటుతో తరచూ ఎవరో ఒకరు గాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో వీధికుక్కలకు రేబిస్ టీకాలు ఇస్తున్నారు. డిప్యూటి మేయర్ ఆనందయ్య నేతృత్వంలో పశుసంవర్ధకశాఖ వైద్యసిబ్బంది పాల్గొని టీకాలు వేస్తున్నారు. కార్యాచరణను ముమ్మరం చేశారు. వీధికుక్కలకు టీకాలు వేయడం వల్ల ఒక వేళ కుక్కకాటుకు గురైనా రేబిస్ వ్యాధి సోకకుండా ఉంటుందన్నారు.


టీకా వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బంతిపూలకు తగ్గిన డిమాండ్

హోసూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పండుగలు, పర్వదినాల వేళ పూలధరలు ఎక్కువగా ఉంటాయి. ఇటీవల వినాయక చవితి సందర్భంగా బంతి, చేమంతి పూలు కిలో రూ.150 నుంచి 250 వరకు పలికింది. ఇటీవల వర్షాలు, వాతావరణ పరిస్థితుల వల్ల అన్ని రకాల పుష్పాలకు గతంలో మాదిరిగా డిమాండ్ లేదు. పండుగకు డిమాండ్ ఉన్నా ఆశించి మేరకు ధరలు లేకపోవడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. సోమవారం కేజీ రూ.50 కూడా పలకలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయుధపూజ వేళకు డిమాండ్ వస్తుందని భావిస్తున్నారు.


పూలుకోస్తున్న రైతులు

చిన్నారులకు అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న పండితులు

గంగావతి రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని శంకర మఠం శారదాంబ ఆలయంలో సోమవారం పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారులు కుమార్ భట్, వినాయక్ భట్ చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. గణేశ్ పూజ, శారదా దేవి పూజతో పాటు సంరక్షకుల పిల్లలు భక్తితో అక్షరాభ్యాసం చేశారు. ఈసందర్భంగా కిన్నల్ గ్రామం నుంచి వచ్చిన అనిల్ కుమార్ మాట్లాడుతూ గంగావతిలోని శృంగేరి శంకర మఠం ఆలయ పూజారులు శృంగేరి శారదాంబ పద్దతి ప్రకారం క్రమం తప్పకుండా అక్షరాభ్యాసం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆలయ నిర్వహణ బోర్డు ఛైర్మన్ ఎటువంటి కొరత లేకుండా చక్కని ఏర్పాట్లు చేశారని, శారదాంబ ఆశీస్సులు పిల్లలందరికీ ఉండాలని కోరుకున్నారన్నారు. మొత్తం పది పిల్లలు సంరక్ష కులు అక్షరాబ్యాసంలో పాల్గొన్నారు. రాఘవేంద్ర జోషి నారాయణరావ్ వైద్య, శ్రీనివాస్‌భట్,ఉపాధ్యాయిని కవితా దిగ్గావి తదితరులున్నారు.

వైద్య సిబ్బందిని సస్పెండ్ చేయాలని నిరసన


అంబేడ్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించిన ప్రజా సంఘాల నాయకులు

కంప్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : తల్లికూతురు మరణానికి కారణమైన వైద్యుడు, నర్సును సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం కంప్లి పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో వివిధ సంఘాల నిరసనలు చేపట్టాయి. ఈ సందర్భంగా కర్నాటక దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్, నంద్యాల మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించిన డాక్టర్ రవీంద్ర కనికేరి, నర్స్ రజినిలను కేవలం బదిలీ చేయడం తగదని, తక్షనమే వారిని సస్పెండ్ చేయాలని కోరారు. అలాగే వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలన్నారు. దీంతో పాటు చంద్రమ్మ కుటుంబానికి రూ. 20 లక్షలు నష్టపరిహారం కల్పించాలని కోరారు. ఇంత జరిగినా కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకోవడం తగదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో ఇలా నిర్లక్ష్యం వహించేవారిపై అధికారులు నిఘా వుంచి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో బాలింతల మరణాలతో రాష్ట్రవ్యాప్తంగా అప్రతిష్ట వాటిల్లిందన్నారు. అనంతరం ఆరోగ్యశాఖ అధికారి హనుమంతప్పకు గ్రేట్ టు తహసీల్దార్ షణ్ముఖప్పకు వినతిపత్రాన్ని అందించారు. వెంటనే వారిపై తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరసనలో ఎలాంటి సంఘటన జరగకుండా భారీ పోలీసు బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీరేష్, శివకుమార్, సోమప్ప, వన్నెరప్ప, విరుపాక్షి, రాజేంద్ర, రఘు, చంద్రశేఖర్, బసవరాజు, బడిగే చెన్నప్ప, రామాంజినేయులు, మల్లమ్మ, రమణమ్మ, యంకమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షం


కంప్లి పట్టణంలో కురుస్తున్న వర్షం

కంప్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం జోరుగా వర్షం కురిసింది. గ్రామాల నుంచి పట్టణానికి వచ్చిన ప్రజలు జోరు వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో దసరా పండుగ వుండటంతో పట్టణానికి సామాగ్రి కొనుగోలు చేయడానికి పలువురు విచ్చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం ఎడతెరపి లేకుండా కురవడంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని వ్యాపారస్తులు పట్టణవాసులు కొంతవరకు ఇబ్బందులకు గురయ్యారు. ఖరీఫ్ పంటలకు వర్షంతో ఎక్కువ తెగుళ్ల సోకి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సిరుగుప్ప, (ఆంధ్రజ్యోతి) : ఎడతెరపిలేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. తాలుకా వ్యాప్తంగా వారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే పలు పంటలు దెబ్బ తిన్నాయి. పలు చోట్ల ప్రభుత్వ కార్యాలయాలు, పూరి గుడిసెలు కూలిపోయాయి. తహసీల్దార్ కార్యాలయం, శిశు అభివృద్ధి యోజన కార్యాలయాలు వర్షం దెబ్బకు పైకప్పు ఎగిరిపోయి వర్షపు నీరు చేరడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. టెక్కలకోట పట్టణంలో శిథిలావస్థకు చేరిన పూరి గుడిసెలను నగరసభ అధికారులు పూర్తిగా తొలగించారు. తక్షణమే నష్టం వాటిల్లిన పంటలకు, కూలిన ఇళ్లకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు.


పెచ్చులూడిన తహసీల్దార్ కార్యాలయ పైకప్పు